నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

10 | మంగళవారం 18 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




కాసిపేట : కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

# పండుగలా..

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటిన కేసీఆర్ బర్త్ డే వేడుకలు

- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, అన్నదానాలు
- వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఆలయాల్లో పూజలు.. దర్గాల్లో ప్రార్థనలు.. పండ్ల పంపిణీ..
- ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో 708 మంది రక్తదానం
- కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

మంచిర్యాల టౌన్ : మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీచేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కౌటాల : దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు





చెన్నూర్ : శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆసిఫాబాద్ టౌన్ : కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాల, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు(కేసీఆర్) పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పండుగలా నిర్వహించారు. శతమానం భవతి, వెయ్యేళ్లు వర్ధిల్లు అంటూ ఆశీర్వదించారు. ప్రత్యేక తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన పోరాటం, సాధించుకున్న స్వరాష్ట్ర అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నిండునూరేండ్లు జీవించాలని, మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ, వాడవాడనా బర్త్ డే వేడుకలను జరుపుకున్నారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఇంట్లో కేక్ కట్ చేసి, ప్రభుత్వ దవాఖానలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు పాల్గొన్నారు. నస్పూర్‌లో టీబీజీకేఎస్ నాయకులు మొక్కలు నాటారు. దండేపల్లి, జన్నారం మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజారమేశ్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భారీ కేక్ కట్ చేశారు. శివాలయంలో ప్రత్యేక పూజలు, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నూర్ బస్టాండ్‌లో అన్నదానం చేశారు. మందమర్రి, జైపూర్, రామకృష్ణాపూర్‌లో వేడుకలు జరిగాయి. బెల్లంపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్థానిక కొదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో కేక్ కట్ చేసి, మొక్కలు నాటారు.

బోథ్ నియోజకవర్గంలోని నేరడిగొండ మండలంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వయంగా రక్తదానం చేయగా, 708 మంది బీఆర్ఎస్ నాయకులు, యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జోగు రామన్న పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి, శివాలయంలో అన్నదానం చేశారు. జైనథ్ మండల కేంద్రంలో మొక్కలు నాటారు.

నిర్మల్ జిల్లా కేంద్రంలో పార్టీ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ మొక్కలు నాటారు. భైంసాలో బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకులు రమాదేవి నివాసంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. భైంసా ఏరియా హాస్పిటల్‌లో స్థానిక బీఆర్ఎస్ లీడర్లు పండ్లు పంపిణీ చేశారు.

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం, ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. దాదాపు అన్ని మండల కేంద్రాల్లో కేసీఆర్ జన్మదిన వేడుకలు జరిగాయి. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

### ప్రజా సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

**- కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే**



ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 : తెలంగాణ ప్రజల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించి మాట్లాడారు. అన్ని వర్గాలను ఏకం చేసి తెలంగాణ తెచ్చిన మహనీయుడు కేసీఆర్ అని కొనియాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి దేశానికే ఆదర్శంగా నిలిపారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నా హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు.



బెల్లంపల్లి : బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



జన్నారం : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



సిర్పూర్(యూ) : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బెజ్జూర్ : మండల కేంద్రంలో కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మందమర్రి : కేకే 5గని పై కేక్‌కట్ చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

# దుబ్బగూడెంలో చెత్త డంప్‌పై ఆగ్రహం

**రహదారిపై గ్రామస్తుల రాస్తారోకో**

కాసిపేట, ఫిబ్రవరి 17 : బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్తను తీసుకొచ్చి దుబ్బగూడెం శివారులో డంప్ చేయడంపై గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం దుబ్బగూడెం రహదారిపై ధర్నా చేశారు. నిత్యం ఇక్కడికి అనేక వాహనాల్లో చెత్తను తీసుకొచ్చి వేస్తున్నారని, దానిని కాల్చడం వల్ల రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ చర్యలు మానుకోవాలని, లేదంటే ఉందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాతో రహదారిపైకి ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ అక్కడికి చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పారు. బెల్లంపల్లి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్.. మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోనెల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సపాట్ శంకర్, దుర్గం గోపాల్, బోగె పోశం, సిలోజ్ మురళి, కొయ్యాడ శ్రీనివాస్, సంతోష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



దుబ్బగూడెం రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు

# ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

**రామగుండం సీపీ శ్రీనివాస్**

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 17 : ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం రామగుండం కమిషనరేట్‌కు వచ్చిన వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అప్పటికప్పుడు ఆయా ప్రాంతాల సీఐలు, ఎస్ఐలకు ఫోన్ చేసి సమస్యల గురించి చర్చించారు. పలు సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం, ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు.



ఫిర్యాదుదారులనుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న సీపీ శ్రీనివాస్

**భరోసా కేంద్రం సందర్శన**

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 17 : లైంగిక దాడికి గురైనా బాధితులు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్‌కు వచ్చే వరకూ, పరిహారం ఇప్పించే వరకు భరోసా సెంటర్ వారికి అండగా నిలుస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ వెల్లడించారు. సోమవారం సీసీసీ నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సీపీకి పోలీసు అధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. లీగల్, మెడికల్, చిన్నారుల కౌన్సెలింగ్ గదులు, స్టేట్‌మెంట్ రికార్డు సమావేశ గదిని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడానికి ఇబ్బందిపడే బాధిత మహిళలను భరోసా సెంటర్ అక్కున చేర్చుకుంటుందని, వారికి వైద్యులు, సైకాలజిస్టు, న్యాయాధికారి, పోలీస్ సేవలు అందుతాయన్నారు. సెంటర్‌కు వచ్చే బాధితులకు తక్షణమే సూచనలు, సలహాలు అందించి వారికి భరోసా కల్పించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్‌కుమార్, రూరల్ సీఐ ఆకుల అశోక్ కుమార్, నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ హైమ, సీసీ హరీశ్, భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ విజయ, లీగల్ అడ్వైయిజర్ నవ్యక్రిష్ణ, ఏఎన్ఎం రజిత, ప్రియాంక, పుష్పలత, ప్రమీల పాల్గొన్నారు.

# పత్తి కొనడం లేదని రైతుల ఆందోళన

బెల్లంపల్లి, ఫిబ్రవరి 17 : రోజుల తరబడి పత్తి కొనుగోళ్లు చేయడం లేదని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రైతులు నిరసన చేపట్టారు. సోమవారం బెల్లంపల్లిలోని శ్రీరామ జిన్నింగ్ మిల్లు వద్ద మంచిర్యాల-ఆసిఫాబాద్ ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయకపోవడం వల్ల వారం నుంచి జిన్నింగ్ మిల్లు వద్ద పడిగాపులు కాస్తున్నామని, వాహనాల అద్దె భారం తమపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ కుమారస్వామి అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపచేయించారు.



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

# రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే క్రిమినల్ కేసులు

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 17: రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారితో కలిసి పౌరసరఫరాల ఉప తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థ కార్యకలాపాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

## ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

నస్పూర్, ఫిబ్రవరి 17 : జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మంచిర్యాల డీఐఈవో అంజయ్య తెలిపారు. పరీక్షలకు 30 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు, మొత్తం 5,482 మంది రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. హాజరుకాని విద్యార్థులు ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే ప్రాక్టికల్స్‌కు రావాలని సూచించారు.

## ఆక్రమణలపై ఉక్కుపాదం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 17 : పట్టణంలోని కాల్‌టెక్స్ కెమికల్ ఏరియా సింగరేణి ప్రాంతంలో వెలిసిన తాత్కాలిక నిర్మాణాలను సోమవారం సింగరేణి ఎస్‌అండ్‌పీసీ విభాగం సిబ్బంది తొలగించారు. సింగరేణి ఖాళీ స్థలంలో రాత్రికి రాత్రే అక్రమార్కులు సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి, కబ్జాకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న జమేదార్ దాసరి మల్లేశ్ సిబ్బందితో అక్కడికి చేరుకొని వాటిని నేలమట్టం చేశారు. సింగరేణి స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## బాబోయ్ పులి

**రంగపేట సెంట్రల్ నర్సరీ సమీపంలో సంచారం**

నెన్నెల, ఫిబ్రవరి17 : నెల రోజులుగా బెల్లంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సంచరించిన ఆడ పెద్దపులి నెన్నెల మండలం అటవీప్రాంతంలోకి అడుగు పెట్టింది. కుష్నపల్లి అటవీ రేంజ్ పరిధిలోని రంగపేట బీట్‌లోగల చెర్లపల్లి, ఎల్లారం మీదుగా బొప్పారం గ్రామ సమీపంలోని రంగపేట సెంట్రల్ నర్సరీ సమీపంలో కనిపించింది. సోమవారం అటవీశాఖ రేంజ్ అధికారి దయాకర్, డిప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, సిబ్బంది పులి కదలికలను పరిశీలించారు. రంగపేట నర్సరీ పక్కనున్న నెన్నెల-బెల్లంపల్లి ప్రధాన రోడ్డును దాటింది. పెద్దపులి వచ్చిందని తెలిసి ఆ రూట్లో వెళ్లే ప్రయాణికులు భయపడుతున్నారు.



పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు